విశాలాంధ్ర విశాఖపట్నం

గురువారం 30, అక్టోబర్ 2025

పేజీ నెం. 5

కేజీహెచ్‌లో 'వరల్డ్ స్ట్రోక్ డే'

విశాలాంధ్ర - వన్‌టౌన్: వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా కేజీహెచ్‌లో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సుమారు 200మంది వైద్యులు హాజరు కాగా వారందరికీ అనుభవజ్ఞులు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఎంసీ ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ కేవీఎస్ఎం సంధ్యాదేవితోపాటు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి (అదనపు డీఎంఈ), కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ బీవీ రమణ హాజరై మాట్లాడారు. ఏఎంసీ న్యూరాలజీ విభాగాధిపతి, డాక్టర్ సీపాన గోపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమం విజయవంతమైంది. పలువురు మహిళా న్యూరాలజిస్టులు, విభాగాధిపతులు, ఫ్యాకల్టీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, మెడిసిన్ విభాగాలకు చెందిన పీజీలు పాల్గొన్నారు.

తప్పిన 'మొంథా' ముప్పు

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం, విశాఖవాసులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మూడు రోజులపాటు రాష్ట్ర ప్రజలకు కంటిమీద కునుక లేకుండా చేసిన మొంథా తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిసాయి. వీధులు, రోడ్లు కలిసి ఏరులై పొంగి పొర్లాయి. పెను ప్రమాదం తప్పిందంటూ విశాఖ నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రజలకు మొంథా తుఫాను గత అర్ధరాత్రి అంతర్వేది వద్ద తీరం దాటిందన్న వార్త ఉపశమనం కలిగించింది. మళ్లీ హుద్ హుద్ లాంటి పరిస్థితులు ఎదురవుతాయేమోనని ఆందోళన చెందారు. అయితే బుధవారం ఎప్పటిలాగే నగరం ప్రశాంత ఉదయాన్ని చూసింది. బుధవారం కూడా తేలికపాటి వర్షాలు కురిసాయి. పునరావాస కేంద్రాల్లో అన్నీ ఏర్పాట్లు చేసినప్పటికీ ఎలాంటి ప్రమాదాలు, ముంపులు జరగకపోవడంతో ప్రజలు సురక్షితంగానే బయటపడ్డారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేల

కొరిగాయి. మరికొన్నిచోట్ల ప్రహరీలు, శిథిలావస్థకు చేరిన ఇళ్ల గోడలు కూలిపోయాయి. అయినప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం, ప్రాణ నష్టం సంభవించలేదు. బీచ్ రోడ్డులో అధిక వరద నీరు రావడంతో కొన్నిచోట్ల కోతకు గురైంది. తీర ప్రాంతం తీవ్ర అలజడిగానే మారింది. వివిధ ప్రభుత్వ శాఖలు పునరావాస చర్యల్లో భాగంగా రోడ్లపై ఉన్న నీటిని తొలగిస్తూ, చెట్లను తొలగించారు. ఎక్కడ విద్యుత్ అంతరాయం లేకుండా ఈపీడీసీఎల్ అధికారులు వెంట వెంటనే సహాయక చర్యలు చేపడుతున్నారు. బుధవారం కలెక్టర్ జీవీఎంసీ కమిషనర్‌తోపాటు పలువురు ఎమ్మెల్యేలు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో కాలనీలో పర్యటనలు చేశారు. సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తానికి తుఫాన్ ముప్పు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విజిలెన్స్ విభాగం ఏర్పాటయ్యేనా...?

ఒవిశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో విజిలెన్స్ విభాగం ఎప్పుడు ఏర్పాటు చేస్తారని భక్తులు, స్థానికులు దేవాదాయ శాఖను ప్రశ్నిస్తున్నారు. దేవాలయాలు అంటే పవిత్రంగా చూస్తాం. కానీ కొంతమంది పుణ్యమా అని దేవాలయాల్లో నిర్వాహణ లోపాలు బయట పడుతున్నాయి. కొన్ని చోట్ల దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పనితీరుపై కూడా అనుమానాలు రావడంతో ఎక్కడికక్కడ విచారణలు జరుగుతున్నాయి. దేవాలయాల్లో విజిలెన్స్ విభాగం అనేది సాధారణంగా ప్రభుత్వ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ విజిలెన్స్ విభాగం దేవాలయాల నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, ఆస్తులు, ఇతర అంశాలలో అవినీతి నివారించడానికి, సంబంధిత ఫిర్యాదులను పరిశోధించడానికి పనిచేస్తుంది.



అవినీతిని అరికట్టడానికి, నివారణ చర్యలు చేపట్టడం, దేవాలయ ఉద్యోగులపై వచ్చిన అవినీతి ఫిర్యాదులను పరిశోధించి, దర్యాప్తు చేయడం, దేవాలయాల నిర్వహణలో అవినీతిని నివారించడానికి అవసరమైన చర్యలను తీసుకోవడం, దేవాలయాల ఆర్థిక లావాదేవీలను పర్యవేక్షించడం, అవసరమైన చోట తనిఖీలు నిర్వహించేందుకు గాను విజిలెన్స్ విభాగం ఉపయోగపడుతుంది.

ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

విశాలాంధ్ర - వన్‌టౌన్: దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదానికి గురైన బోటు వద్దకు వచ్చి ఘటన వివరాలు తెలుసుకున్నారు. తుఫాను కారణంగా ఫిషింగ్ హార్బర్ సెంట్రల్ డాక్ ప్రాంతంలో నిలిపివుంచిన మేరుగ ధనరాజు బోటు మునిగిపోయిన

నేపథ్యంలో హుటాహుటీన సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. సుమారు 30 లక్షలు మేర నష్టపోయామని సంబంధిత బోటు యజమాని, అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకి తెలియజేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానిక అధికారులతో మాట్లాడి బోటు ఓనరుకు న్యాయం చేకూర్చాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావుతోపాటు సంబంధిత అధికారులకు ఘటనను వివరించామని త్వరలోనే నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో బోటు అసోసియేషన్ పెద్దలు, స్థానిక మత్స్యకారులు, టిడిపి, బిజెపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

వర్షాలతో నష్టపోయిన కుటుంబాలను ఆదుకుంటాం

విశాలాంధ్ర - ఆనందపురం: మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఆనందపురం మండలం లోని గంభీరం పంచాయతీ గ్రామంలో పరిస్థితి విషమంగా మారింది. పలు ఇళ్ల పెచ్చులు కూలిపోగా, రైతుల పంట పొలాలు, అరటి తోటలు పూర్తిగా నీట మునిగిపోయి నేలమట్ట మయ్యాయి. గ్రామంలోని రహదారులు దెబ్బతిని రాకపోకలు తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఆస్తి నష్టం మాత్రం గణనీయంగా నమోదైంది. పరిణామంపై సర్పంచ్ వానపల్లి ఈశ్వర రావు, ఉప సర్పంచ్ బొట్ట శ్రీను, జనసేన పార్టీ నాయకుడు చల్లా రామిరెడ్డి, కూటమి నాయకులు గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షాల వల్ల నష్టపోయిన కుటుంబాలకు అండగా ఉంటామని, సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారు భరోసా ఇచ్చారు.

విద్యుత్ పునరుద్ధరణ కార్యక్రమాల్లో ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మొంథా తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యల్లో భాగంగా తిరుపతి నుండి ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ బుధవారం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయానికి విచ్చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ కార్యక్రమాలను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో, కార్పొరేట్ కార్యాలయం నుండి అవసరమైన సమన్వయ సహకారం అందించేందుకు చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఆదేశాల మేరకు శివశంకర్ విశాఖపట్నం చేరుకున్నారు. ఇప్పటికే ఏపీఎస్‌పీడీసీఎల్ నుంచి సుమారు 1,500 మంది అధికారులు, సిబ్బంది తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. సీఎండీ శివశంకర్, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు డి. చంద్రం, టి.వనజ, సీజీఎం వి.విజయలలిత, ఎస్ఈ సురేఖ తదితరులతో సమావేశమై క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన మెటీరియల్ సరఫరా, మద్దతు చర్యలపై సమీక్షించారు.

మధురవాడ పి.పి-1 కాలనీలో పర్యటించిన గంటా రవితేజ

విశాలాంధ్ర - కొమ్మాది: మొంథా తుపాను కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్న జీవీఎంసీ 5వ వార్డు పి.పి-1, జె.ఎన్.యు.ఆర్.ఎం. కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజ, కార్పొరేటర్ మొల్లి హేమలత బుధవారం పర్యటించారు. తాగునీరు, డ్రైనేజ్ సౌకర్యాల పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తుపాను తీవ్రత వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైందని పేర్కొన్నారు. అస్తవ్యస్త డ్రైనేజ్ వ్యవస్థ కారణంగా వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత, వై.జీవన్ కుమార్, బమ్మిడి తారక్, సాయి, 5వ వార్డ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు శరగడం ఆహారం పంపిణీ

విశాలాంధ్ర - పెందుర్తి: మొంథా తుఫాను బాధితులకు వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాజీ కార్పొరేటర్ శరగడం చిన్న అప్పలనాయుడు ఆహారం పంపిణీ చేశారు. పెందుర్తి తాండ్రపాపారాయ కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రం, జేఎన్ఆర్ఎం కాలనీలలో ఉన్న 600 మంది నిర్వాసితులకు ఆహారం పొట్లాలను బుధవారం సాయంత్రం అప్పలనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ హుదుద్ తుఫాను సమయంలోను, కరోనా విపత్తులోనూ సహాయ కార్యక్రమాలు కొనసాగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొర్లె రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నారాయణేశ్వర స్వామి - పార్వతి అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీ నియామకం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం గ్రామంలో కొలువైన నారాయణేశ్వర స్వామి - పార్వతి అమ్మవారి దేవస్థానమునకు భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కార్యవర్గాన్ని సత్కరించి అభినందించారు. అధ్యక్షులుగా కుప్ప రామలక్ష్మి, ఉపాధ్యక్షులుగా లంకలపల్లి నరసింహమూర్తి, కార్యదర్శి కుప్ప పోతయ్య, జాయింట్ సెక్రెటరీ లంకలపల్లి సంతోష్, జాయింట్ సెక్రెటరీ ముడసల శ్రీను, కోశాధికారి ఇమంది వెంకట శ్రీనివాసరావు, సహాయ కోశాధికారి లంకలపల్లి సాయి చంద్ర ప్రసాద్, సహాయ కోశాధికారి పుట్ట నానాజీ, ఆర్గనైజర్ మేడిశెట్టి గౌరీ శంకర్, ఆర్గనైజేషన్ బుర్ల గౌరీ శంకర్, ప్రచార కార్యదర్శి కుప్ప సంతోష్‌లను ఉత్సవ కమిటీగా నియమించారు.

తుఫాను నష్టాలను జాగ్రత్తగా అంచనా వేయండి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: మొంథా తుఫాను నష్టాలను జాగ్రత్తగా అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం టెలి కాన్ఫరెన్స్ ద్వారా తుఫాను అనంతరం తీసుకోవలసిన చర్యలపై జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, జోనల్ అధికారులు, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను అనంతరం తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో సాధారణ పరిస్థితులు తీసుకు రావాలని, పారిశుధ్యం, నీటి వనరుల క్లోరినేషన్, దెబ్బతిన్న రోడ్లపై గుంతలు పూడ్చడం, ల్యాండ్ స్లయిడింగ్ జరిగిన చోట రోడ్ల పునరుద్ధరణపై జోనల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ చెప్పారు. తుఫాను నష్టాలను జాగ్రత్తగా అంచనా వేయాలని, పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్న గృహాలను నమోదు చేయాలన్నారు. పంట, పశు నష్టం, బోట్లు నష్టం

అంచనాలను తయారు చేయాలన్నారు. దెబ్బతిన్న పంచాయతీ రాజ్, ఆర్ ఎండ్ బి మైనర్ ఇరిగేషన్, పాఠశాలల భవనాల అంచనాలు తయారు చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరాశ్రయులైన వారికి, తుఫాను వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను గుర్తించి పరిహారం అందించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నష్టం అంచనాలను గురువారం సాయంత్రానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా క్షేత్ర స్థాయిలో టీంగా పని చేసిన అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారని చెప్పారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా వెంటనే పునరుద్ధరించిన అధికారులను, ప్రత్యేక అధికారులను కలెక్టర్ అభినందించారు. తుఫాను వల్ల నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం 25 కెజీల బియ్యం,ఒక కిలో కందిపప్పు, ఒక లీటర్ ఆయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళ దుంపలు, కేజీ పంచదార ఇవ్వాలని, అలాగే తుఫాను వల్ల వేటకు వెళ్ళక పోవడం వల్ల భృతిని కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలకు 50 కెజీల బియ్యం అందించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. నిరాశ్రయులై రిలీఫ్ కేంద్రాలకు వచ్చిన వారికి, వారు తిరిగి వెళ్ళే టపుడు ఒక్కరికి వెయ్యి రూపాయలు, ఒక కుటుంబంలో గరిష్టంగా 3 వేలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కనుక అధికార యంత్రాంగం వాస్తవమైన లబ్ధిదారుల జాబితా తయారు చేయాలన్నారు.

తుఫాను ప్రభావ ప్రాంతాల్లో త్వరితగతిన చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మొంథా తుపాన్ దృష్ట్యా విశాఖలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, గాలులకు తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో జీవీఎంసీ యంత్రాంగం సఫలమైనదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. జీవీఎంసీ అధికారులు, సిబ్బంది పూర్తి సహాయక చర్యల్లో నిమగ్నమై తమ విధులను నిర్వహించారని, అలాగే జీవీఎంసీ సిటీ ఆపరేషన్స్ సెంటర్ నుండి ఉన్నతాధికారులు నిరంతరం పరిస్థితులను పరిశీలిస్తూ దిగువ స్థాయి అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం తెలిపారు. తుఫాను కారణంగా గత మూడు రోజుల నుండి ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులలో భాగంగా సిటీ ఆపరేషన్స్ సెంటర్‌కు 229 ఫిర్యాదులు అందగా వాటిలో 224 ఫిర్యాదులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడం జరిగిందని కమిషనర్ తెలిపారు. కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజల కొరకు 79 పునరావాస కేంద్రాలను గుర్తించామని, అందులో 13 పునరావాస కేంద్రాలలో 293 మంది ప్రభావిత ప్రాంత ప్రజలను తరలించి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. అలాగే 160 చెట్లు కూలిపోగా వాటిలో 157 చెట్లను తొలగించామని, 10 వీధిలైట్లు నేల కూలగా వాటిని మరల జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది పునర్దించారని తెలిపారు. 20 భూగర్భ డ్రైనేజీ నాళాలు, వర్షాభావం వలన భారీగా 30 చోట్ల వరద నీరు నిలువ ఉన్నట్లు గుర్తించి వాటి అడ్డంకులను తొలగించి యధా స్థానానికి తీసుకొచ్చామన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. డీఐజీ బుధవారం అనకాపల్లి జిల్లా దేవరపల్లి మండలం, రైవాడ జలాశయం పరిసర ప్రాంతాలు, శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం మండలంలోని బహుదా నది పరివాహక గ్రామాలు, అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాలు ముంపు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి, తుఫాన్ హెచ్చరికలు, వాతావరణ సూచనలు గమనించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రదేశాలకు తరలించాలన్నారు. డీఐజీ సంబంధిత జిల్లా పోలీస్ అధికారులు, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ విద్యుత్ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రజల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. రైవాడ జలాశయంలో నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక అధికారులు, పోలీసులు నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. బహుదా నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ముఖ్యంగా చత్రపల్లి గ్రామం (జి.కె. వీధి మండలం), పులుసు మామిడి గ్రామం (అనంతగిరి పంచాయతీ పరిధి) మాధిగమల్లు గ్రామం (గుమ్మరేవుల పంచాయతీ సీలేరు పోలీస్ స్టేషన్ పరిధి) ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తుపాన్ బాధితులకు పునరావాసం ఏర్పాట్లు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: తుఫాన్ బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. మొంథా తుపాన్ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు పెదగంట్యాడ సిడబ్ల్యూసి భవనంలో పునరావాసం కల్పించారు. 75వ వార్డు కార్పొరేటర్ దంపతులు పులి లక్ష్మీబాయి వెంకట రమణా రెడ్డి పునరావాస కేంద్రం చేరుకొని తమ సొంత నిధులతో బాధితులకు అవసరం అయిన అల్పాహారం, మంచి నీరు, దోమల నివారణ చక్రాలు, దుప్పట్లు అందించడం జరిగింది. 75వ వార్డులో శ్రీ పెంటమాంబ ఆలయం ప్రాంగణంలో ఒక చెట్టు కూలి గోడకు, బీటీ రోడ్డుకు నష్టం జరిగింది. వెంటనే స్థానిక కార్పొరేటర్ పులి ఝాన్సీ లక్ష్మీబాయి

వెంకటరమణరెడ్డి పెంటమాంబ ఆలయ కమిటీ సభ్యులు విషయం చెప్పగా వారు హుటిహుటిన అక్కడికి చేరుకొని వాటిని పరిశీలించి వెంటనే జోన్ -6 హార్టికల్చర్ అసిస్టెంట్ పూజిత, ప్లాంటేషన్ సూపర్వైజర్ ఈశ్వరరావు, చెట్లు తొలగింపు బృందాలు, జెసిబి యంత్రం అక్కడికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ పెంటమాంబ ఆలయ కమిటీ సభ్యులు పాల అప్పారావు, పాల అప్పల రెడ్డి, నీలాపు పరదేశి, చేట్ల రామారావు, దూడ శంకర్ రెడ్డి, పెంటయ్య రెడ్డి పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - ఆనందపురం: మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో గత 3 రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో జరిగిన నష్టంపై నివేదిక కోసం పంచాయతీలో మండల రెవెన్యూ అధికారి శ్రీనుబాబు పర్యటించారు. భారీగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఇళ్ళు, బాధిత కుటుంబాలు సమస్యలను తెలియపరిచారు. వర్ష పభావంతో నష్టపోయిన అంచనా నివేదిక తయారు చేయాలని తెలిపారు. స్థానిక నాయకులు ఆధ్వర్యంలో ముంపు ప్రభావిత ప్రాంతంలో ఉన్న వరద బాధితుల కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, ఆనందపురం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, జనసేన విశాఖ జిల్లా రూరల్ మజ్జి శ్రీను, బంకు రాజు, స్కూల్ కమిటీ చైర్మన్ రాంబాబు, జనసేన నాయకులు, వార్డు సభ్యులు కోరాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో గంటా బోటు ప్రయాణం

నష్టం వాటిల్లకుండా చూడాలన్న గంటా

విశాలాంధ్ర - భీమిలి: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బోటులో ప్రయాణించి బాధితులను కలుసుకున్నారు. తాటిపూడి రిజర్వాయర్ డ్యామ్ గేట్లు తెరవడంతో మండలంలోని పెద నాగమయ్యపాలెం గ్రామం ముంపునకు గురైంది. దీంతో గ్రామంలో 32 కుటుంబాలను సమీపంలోని తుపాను రక్షణ కేంద్రానికి తరలించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న గంటా విషయం తెలుసుకుని బుధవారం కొంత దూరం బోటు ప్రయాణం చేసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారందరికీ నిత్యావసరాలను పంపిణీ చేశారు. రక్షణ కేంద్రాల్లో తల దాచుకుంటున్న బాధితులకు ఆహారం, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ తుపాను నష్ట నివారణ చర్యలను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని అధికారులను అప్రమత్తం చేస్తోందని వెల్లడించారు. తుపాను వల్ల కలిగిన ఆస్తి, పంట నష్టాలను అంచనా వేసి, ప్రభుత్వానికి పంపాలని ఆర్డీఓ సంగీత్ మాథుర్, ఎమ్మార్వో రామారావులను ఆదేశించారు. జీవీఎంసీ 2వ వార్డులోని చిల్లపేట చెరువును ఎమ్మెల్యే పరిశీలించారు. 3వ వార్డు భీమిలి బీచ్ రోడ్‌లో కోతకు గురైన బీచ్‌ను.. ఆ ప్రాంతంలోని నివాసాలను సందర్శించారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, జెడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, నాయకులు చిక్కాల విజయ్ బాబు, సరగడ అప్పారావు, గంటా నూకరాజు, డి.ఎ.ఎన్.రాజు, గొలగాని నరేంద్ర, కొప్పల రమేష్, గాడు అప్పలనాయుడు, వై.అనీల్ ప్రసాద్, తమ్మిన సూరిబాబు, కొప్పల కృష్ణ, జీరు సత్యనారాయణ, పాసి త్రినాధ్, పొట్నూరు రాము, పరశురామ్ పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: మొంథా తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన ప్రాంతాలను జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. పెందుర్తి మండలం పినగాడి జంక్షన్, అక్కిరెడ్డిపాలెం నుండి జుత్తాడ వెళ్ళు రోడ్లులో దెబ్బతిన్న కల్వర్టును ఆయన పరిశీలించారు. పినగాడి జంక్షన్ నుండి కోటపాడు రహదారిపై తుఫాను కారణంగా భారీగా నీరు ప్రవహించడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గ్రహించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, ఎంపీడీవో అప్పలరాజు, పిఆర్ డిపార్ట్మెంట్ డిఈ,ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నళిని, ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ బాలరాజు, నేషనల్ హైవే అధికారులు, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రాము నాయుడు, కరక దేవుడు, సీనియర్ నాయకులు బైలపూడి హర గోపాల్, పెందుర్తి పిఏసిఎస్ చైర్మన్ ఐతి సింహాచలం, నేటిపల్లి మహేష్, సేనాపతి సోమశేఖర్, ఉగ్గిన అచ్చిబాబు, డిబిఎల్ నాయుడు, బడితబోయిన రాము, సదరం భీమేశ్వరావు, రాపర్తి కృష్ణమోహన్, రాపర్తి కిషోర్, అక్కిరెడ్డి నరసింహమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: తుఫాను నేపథ్యంలో విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్వాడీలకు 30వ తేదీన సెలవులు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు జాగ్రత్తలు నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలియజేసినట్లు డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. అంగన్వాడి కేంద్రాలు కూడా తెరవరాదని కలెక్టర్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు.

చెరకు రైతులకు మద్దతు ధర పెంపు

విశాలాంధ్ర - విశాఖపట్నం: రైతు అనుకూల చర్యల్లో భాగంగా యోగి ప్రభుత్వం 2025-26 క్రషింగ్ సీజన్‌కు చెరకు ధరలో క్వింటాల్‌కు రూ. 30 పెరుగుదలను ప్రకటించింది. కొత్త రేట్లు ప్రారంభ రకాలకు క్వింటాల్‌కు రూ.400, సాధారణ రకాలకు రూ.390గా నిర్ణయించబడ్డాయి. దీని వలన చెరకు రైతులకు దాదాపు రూ. 3,000 కోట్ల అదనపు ప్రయోజనం లభిస్తుందని ఉత్తరప్రదేశ్ చెరకు అభివృద్ధి మరియు చక్కెర పరిశ్రమ మంత్రి లక్ష్మీ నారాయణ్ చౌదరి తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హయాంలో చెరకు ధరల పెంపు ఇది నాల్గవసారి రైతుల ఆదాయాలను బలోపేతం చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రైతుల కష్టాన్ని గౌరవించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెరకు అభివృద్ధి మరియు చక్కెర పరిశ్రమ మంత్రి లక్ష్మీ నారాయణ్ చౌదరి అన్నారు. "చెరకు రైతులు ఉత్తరప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. వారి ఉత్పత్తులకు న్యాయమైన, సకాలంలో చెల్లింపు అందేలా చూసుకోవడం మా దృఢ నిబద్ధత" అని ఆయన అన్నారు. ప్రభుత్వ రికార్డును హైలైట్ చేస్తూ, యోగి పరిపాలన ఇప్పటివరకు చెరకు రైతులకు రూ. 2,90,225 కోట్లు చెల్లించిందని చౌదరి పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన నేతలు

విశాలాంధ్ర - ఆనందపురం: మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో గత కొన్ని రోజులు నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆనందపురం మండలం గొట్టిపల్లి కల్లాలులో ఉన్న అంగన్వాడీ కేంద్రం నీటి మునిగి పోయిందని విషయం తెలుసుకున్న పంచాయతీ నాయకులు అంగన్వాడీ కేంద్రం గొట్టిపల్లి పంచాయతీ సాయి బాబా గుడి వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ మునిగిపోవడంతో అక్కడికి వెళ్ళి సమస్యను పరిష్కారం చేసారు.

అనంతరం వర్షాలు పడే ప్రతీ సారీ అంగన్వాడీ కేంద్రం నీట మునిగి పోవడం జరుగుతుంది. సమస్య మరల పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని వర్షపు నీరు భయటకు పోయే విధంగా మండల పరిషత్ నిదులు ద్వారా పైపు లైన్ నిర్మాణం చేపట్టాలని యంపిపి ప్రతినిధిని స్థానిక నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, మాజీ గ్రంథాలయం చైర్మన్ మణిశంకర్ నాయుడు, విశాఖ జిల్లా యువజన విభాగం మాజీ ప్రదాన కార్యదర్శి ఇల్లాపు వెంకట్, జగన్, సర్పంచ్ గంటా జగదీశ్వర్రావు, బంటుపల్లి సూరి నాయుడు, కంది సూర్యనారాయణ, పాలవలస రవి, చిప్పాడ శ్రీను, బంటుపల్లి సత్యంనాయుడు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - వన్‌టౌన్: ప్రాణాంతకమైన రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ హెచ్చరించారు. ప్రతి ఏటా అక్టోబర్లో రొమ్ము క్యాన్సర్

మాసోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం ఏవీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న చైతన్య స్రవంతి కార్యాలయంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ షిరీన్ రహమాన్ మాట్లాడుతూ రొమ్ముల్లో వస్తున్న మార్పులు, కణితలు, రక్తస్రావం జరుగుతున్న సందర్భంలో మహిళలు అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. 35ఏళ్ళు దాటిన మహిళలు ప్రతీ నెల రొమ్ములను పరీక్షించుకోవాలని ఏమాత్రం అనుమానం వచ్చినా వైద్యుల వద్దకు వెళ్లి పరీక్షలు జరుపుకోవాలని సూచించారు. రొమ్ము క్యాన్సర్ పట్ల చైతన్య స్రవంతి నిత్యం మహిళల్లో అవగాహన కల్పిస్తూనే ఉందని తెలిపారు. ఈ శిబిరానికి మహిళలు పింకు చీరలు ధరించి హాజరు కావడం గమనార్హం.

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించాలి

ప్రభుత్వ సహాయక చర్యలపై ప్రశ్నించాలి శ్రేణులకు వైసీపీ నేతలు పిలుపు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం తక్షణమే సహాయ చర్యలు చేపట్టాలని రోడ్లను నిర్మించాలని, గండ్లు పడిన చెరువులకు మరమ్మతు పనులు వెంటనే చేయాలని ఆ దిశగా వైసిపి శ్రేణులు ప్రజా ఉద్యమం నిర్వహించాలని వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు కోరారు. బుధవారం సాయంత్రం విశాఖపట్నం వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు విశాఖపట్నం జిల్లాలో మొంథా తుఫాన్ వరద ప్రభావిత ప్రాంతాల గురించి పార్టీ కమిటీల నిర్మాణం గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ,విజయనగరం జిల్లా అధ్యక్షులు చిన్న శ్రీను ,ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి , నియోజవర్గ సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్ ,తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి ,మొల్లి అప్పారావు ,డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఎస్.ఇ .సి సభ్యులు సతీష్ వర్మ,పీలా వెంకట లక్ష్మీ,హెచ్.ఐ ఫారుకి,రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు పేర్ల విజయ్ చందర్,ద్రోణంరాజు శ్రీనివాస్,చెన్న జానకిరామ్,కార్పొరేటర్లు బర్కత్ అలీ,కె.వి.యన్ శశికళ, మహమ్మద్ ఇమ్రాన్,బిపిన్ కుమార్,జోనల్ యువజన విభాగం ప్రెసిడెంట్ అంబటి శైలేష్, జిల్లా పార్టీ కమిటీ అధికార ప్రతినిధులు ఆల్ఫా కృష్ణ,పళ్ళ దుర్గ,మంచ నాగమల్లేశ్వరి,హరి కిరణ్ రెడ్డి,జిల్లా అనుబంధ కమిటీ అధ్యక్షులు బోణీ శివ రామ కృష్ణ,నీలి రవి సనపల రవీందర్ భరత్,శ్రీదేవి వర్మ,శంకర్ బత్తుల ప్రసాదు,మార్కెండేయులు,బొండా ఉమామహేశ్, సకలబత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర -పెందుర్తి: పెందుర్తి మండలం జీవీఎంసీ 96వ వార్డు తాండ్రపాపారాయుడు కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన మొంథా తుఫాను పునరావాస కేంద్రాన్ని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బుధవారం సందర్శించారు. తుఫాన్ పునరావాస కేంద్రంలో ఉన్న ఏకలవ్యకాలనీ నిర్వాసితులతో మాట్లాడి వారి కష్టసుఖాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిత్యం తుఫాన్ పరిస్థితులు మినిట్ టూ మినిట్ మోనరటింగ్ చేస్తూ అవసరమైన సలహాలు సూచనలు అందిస్తున్నారని తెలిపారు. తుఫాన్ పునరావాస కేంద్రాలకు విచ్చేసిన ప్రజలకు ఉదయం టిఫిన్ మధ్యాహ్నం రాత్రి భోజనం వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి మండల ఎంపీడీవో అప్పలరాజు, మండల రెవెన్యూ అధికారి వెంకట అప్పారావు, జోన్ 8 జోనల్ కమిషనర్ శంకరరావు,

బీజేపీ పార్టీ పెందుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ గొర్లి రాము నాయుడు, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ అయితి సింహాచలం, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రాము నాయుడు, కరక దేవుడు, సేనాపతి సోమశేఖర్, డబిల్ నాయుడు, బైలపూడి హర గోపాల్, నేటిపల్లి మహేష్, రాపర్తి కిషోర్, రాపర్తి కృష్ణమోహన్, అక్కిరెడ్డి నరసింహ మూర్తి, ఉగ్గిన అచిబాబు పాల్గొన్నారు.

పెందుర్తిలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన మేయర్

విశాలాంధ్ర - పెందుర్తి: మొంథా తుఫాన్ కారణంగా జివిఎంసి ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని నివసిస్తున్న వారికి అన్ని సదుపాయాలు కల్పించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పెందుర్తి జంక్షన్ లో తాండ్రపాపారాయుడు కళ్యాణ్ మండపంలో ఏర్పాటు చేసిన

పునరావాస కేంద్రాన్ని జివిఎంసి అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ తీరం దాటినప్పటికీ ముప్పు తొలగిపోలేదని తుఫాను ప్రభావంతో విశాఖలో వర్షాలు అధికంగా కురుస్తున్నందున కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెందుర్తి ఏకలవ్య కాలనీ ముంపు ప్రాంతం అయినందున వర్షపు నీరు చేరి కాలనీ లోనికి వర్షపు నీరు చేరిందని, అక్కడ నివసిస్తున్న 92 మంది ప్రజలను పెందుర్తి జంక్షన్ లో ఉన్న తాండ్రపాపారాయుడు కళ్యాణ్ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామలింగేశ్వర రెడ్డి, ఏపీడి చిరంజీవి, ఇతర జివిఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మొంథా తుఫానును ఎదుర్కొందాం

భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్

విశాలాంధ్ర - భీమిలి: కోస్తాంధ్రపై తీవ్ర ప్రభావం చూపుతున్న మొంథా తుఫానును ప్రజలందరి సహకారంతో ఎదుర్కొందామని భీమిలి ఆర్డీఓ సంగీత్ మాధుర్

అన్నారు. తుఫాను ఎక్కువగా ప్రభావం చూపే మత్స్యకారుల గ్రామాలు అయిన బోయవీధి, తోటవీధి గ్రామాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక మత్స్యకారుల నాయకుడు గంటా నూకరాజు, భీమిలి తహసీల్దార్ రామారావుతో కలసి సందర్శించారు. తీరప్రాంతంలో జీవించే మత్స్యకారుల సహాయం కోసం, నివాసం కోసం రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన షెల్టర్లను పరిశీలించారు. భీమిలి గ్రామదేవత శ్రీ నూకాలమ్మ దేవాలయం వద్ద ఉన్న పాఠశాల, పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సెకండ్ వార్డు పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు ఆర్డీఓ దృష్టికి బోయవీధి తీరం కోతకు గురవుతున్న ప్రాంతాన్ని వివరించి పరిశీలించారు. రెండు గ్రామాల మత్స్యకారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మారోజు సంజీవ్ కుమార్, కొక్కిరి అప్పన్న, కాసరపు ఎల్లాజీ, కనకల అప్పలనాయుడు, నొల్లి రమణ, కర్రి శివ, సచివాలయం సిబ్బంది, కార సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అలుపెరగని ప్రజాసేవకుడు మొకర నారాయణరావు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి: సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజలతో మమేకమై ఎన్నో సమస్యల పరిష్కానికి నాంది పలికిన గొప్ప ఆదర్శ రాజకీయ నాయకుడు మొకర నారాయణరావు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. మొకర నారాయణరావు 91వ జయంతి సందర్భంగా భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న ఆయన నిలువెత్తు విగ్రహానికి భీమిలి జోన్ 3వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గంటా నూకరాజు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఒకే రాజకీయ పార్టీలో సభ్యత్వం తీసుకొని చివర వరకు అదే పార్టీకి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప రాజకీయ నీతిజ్ఞుడు మొకర నారాయణరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చురకల రమణ, మారోజు సంజీవ్ కుమార్, వాడమొదలు సత్యారావు, కొక్కిరి అప్పన్న, సంకురుభుక్త జోగారావు, రాజగిరి రమణ, జలగడుగుల మురళి, కుప్పిల గురుమూర్తి, కృష్ణారావు మాస్టర్, అప్పికొండ నర్సింగరావు, వియ్యపు పోతురాజు, కొక్కిరి నూకరాజు, వాడమొదలు తవుడయ్య, మొకర నీలకంతం, సూర్యనారాయణ మాస్టర్, వెంకటరావు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ నేపథ్యంలో కురిసిన భారీ వర్షాలకు, వీచిన పెనుగాలులకు నేలకూలిన చెట్లను అధికారులు తొలగించే చర్యల్లో నిమగ్నమయ్యారు. సింగ్ హోటల్ జంక్షన్, జిల్లా పరిషత్ వద్ద గల నేలకూలిన చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించారు.

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం

దృష్టి లోపం కళాకారులకు రూ.4.20 లక్షల విరాళం

వండర్ కిడ్స్ విద్యార్థుల దాతృత్వం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దృష్టి లోపం గల సంగీతకారుల బృందం వై.అమ్మినాయుడు నాయకత్వంలో ఉన్న 13 మంది ఇటీవల స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ సిటీ, గాజువాకా శాఖల విద్యార్థుల కోసం ఒక ప్రేరణాత్మక ఆర్కెస్ట్రా ప్రదర్శన ఇచ్చింది. వారి ప్రదర్శనతో ప్రభావితమైన విద్యార్థులు దాతృత్వ భావంతో ముందుకు వచ్చి, ఆ దృష్టి లోపం గల కళాకారులను ఆదుకునేందుకు మొత్తం రూ.4,20,110 విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును బుధవారం స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మళ్ల రాము

నాయుడు, డైరెక్టర్ ఎం.వాణిశ్రీ, రొంగలి రమణ, ప్రిన్సిపాల్ సంగీతా రాణి, చట్టి గోపీ, చట్టి రమణ, సీనియర్ టీచర్లు భార్గవి నాగలక్ష్మి పాల్గొన్నారు. చైర్మన్ మళ్ల రామునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చూపిన ఉదారతకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కామర్స్ ఎగుమతుల కోసం ఎస్ 20 బిలియన్ల మైలురాయిని అధిగమించిన అమెజాన్

విశాలాంధ్ర - విశాఖపట్నం : 2015-2025 మధ్య కాలంలో అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రోగ్రామ్ ద్వారా భారతదేశం నుండి సంచిత ఈ-కామర్స్ ఎగుమతుల పరంగా లక్షలాది మంది భారతీయ విక్రేతలు 20 బిలియన్లను అధిగమించడానికి వీలు కల్పించినట్లు అమెజాన్ నేడు వెల్లడించింది. 2025 నాటికి భారతదేశం నుండి 10 బిలియన్ల సంచిత ఈకామర్స్ ఎగుమతులను చేస్తామని 2020లో అమెజాన్ ప్రతిజ్ఞ చేసింది. తరువాత కాలంలో దీనిని 20 బిలియన్లకు సవరించారు. ఇప్పుడు, అమెజాన్ తన ఎగుమతుల ప్రతిజ్ఞను గడువుకు ముందే చేరుకుంది. అమెజాన్ యొక్క ప్రధాన ఈకామర్స్ ఎగుమతుల కార్యక్రమం, అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్, 2015లో ప్రారంభించబడింది. గత 10 సంవత్సరాల కాలంలో, ఈ ప్రోగ్రామ్ 2 లక్షలకు పైగా ఎగుమతిదారులను నమోదు చేసింది, మొత్తం మీద ప్రపంచవ్యాప్తంగా 75 కోట్లకు పైగా 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను వినియోగదారులకు విక్రయించింది. ఈ ప్రోగ్రామ్‌లోని మొత్తం విక్రేతల సంఖ్య గత సంవత్సరంలో 33 శాతం కంటే ఎక్కువ పెరిగింది. అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ దేశవ్యాప్తంగా అద్భుతమైన స్వీకరణను చూస్తోంది. భారతదేశం అంతటా 28 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు మరియు 200 కి పైగా నగరాల నుండి విక్రేతలను నమోదు చేసుకుంది.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి : బల్ల గిరిబాబు

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డును రాజకీయాలకు అతీతంగా ఈ నాలుగేళ్లలో 30 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ త్వరలోనే పదవి కాలం ముగుస్తుందని, ఇప్పటికైనా అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని, అధికారులు ప్రజలు తీసుకు వస్తున్న సమస్యలపై స్పందిస్తున్న తీరును అభినందించారు. పార్టీలకు అతీతంగా మున్సిపల్ చైర్మన్ ప్రతి వార్డు అభివృద్ధి చేస్తూ కౌన్సిలర్ లకు ప్రోత్సహిస్తున్నారని, అందుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారం కూడా ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు సమన్వయం చేసుకొని టెండర్లను పిలవాలని కోరారు. కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ చిన్న చిన్న పనులకు నిధులు మంజూరు చేస్తే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మున్సిపాలిటీ 2021 తో ప్రారంభమైన సీఆర్ లకు మోక్షం కలగలేదని,అత్యవసర పనులు చేపట్టడానికి సి ఆర్ లు తీసుకుంటున్నామని, వాటికి 15వ ఫైనాన్స్ నిధులతో కాకుండా జనరల్ ఫండ్ నిధులతో చెల్లించాలని కోరారు. అలాగే తాళపత్ర రహదారిని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. పలాస ఎమ్మెల్యే దృష్టికి తీసుకొస్తే కొత్తగా వచ్చామని, కొంత సమయం కావాలని చెప్పారని, కొత్త టెండర్లు పిలవాలని, ఆ కాంట్రాక్టులకు నిధులు వస్తే గాని పనులు చేయలేమని చెప్పారని సభ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఇచ్చిన టెండర్లకు సంబంధించి జనవరి ఫండ్ ఇవ్వాలని, ఈ సమావేశంలోనే టేబుల్ ఏజెండాగా ప్రవేశ పెట్టాలని చైర్మన్ ఆదేశించారు. దీనిపై కౌన్సిలర్ జోగారావు స్పందిస్తూ అధికారులు కౌన్సిలర్ ల మాట వినకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటే మేమెందుకు రావాలని మండిపడ్డారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ ఎప్పుడైనా ప్రజల నుంచి వచ్చిన సమస్యలు గాని కౌన్సిలర్ నుంచి వచ్చిన సమస్యలపై నేను గాని, కమిషనర్ గాని ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తూ కౌన్సిల్ లో ప్రవేశ పెడుతున్నామని చెప్పారు. కౌన్సిలర్ దుర్గ శంకర్ పండా మాట్లాడుతూ ఎం బుక్ నమోదు చేయడం లేదని, బస్టాండ్ లో ఉన్న నిర్మాణాన్ని ఎంత వరకు పటిష్టంగా ఉందో లేదో చూడాలని చెప్పారు. దీనిపై మున్సిపాలిటీ అధికారులతో మేము కూడా పర్యవేక్షిస్తామని దీంతో ఎంత వరకు పటిష్టంగా ఉందో చెప్పవచ్చని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పలు ప్రాంతాలకు సచివాలయం నిర్మించేందుకు అవకాశం కల్పిస్తే వాటి నిధులు కూడా రావడం లేదని ధ్వజమెత్తారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ మీరు ఇచ్చిన సూచనలు పాటిద్దామని అని పేర్కొన్నారు. కౌన్సిలర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ నర్సిపురంలో ఇంటి వద్దకు నీరు చేరుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, డి ఈ. కనకరాజు, ఏ ఈలు అవినాష్, శ్రీధర్, కౌన్సిలర్లు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌ల సమయంలో బయట ప్రపంచంతో సంబంధం ఉండదు

వంతెనలు నిర్మాణం కోసం హామీలతో కాలం గడుపుతున్న నాయకులు.. నియోజకవర్గాలు మారుతున్న గిరిజనుల తలరాతలు మారటం లేదు..

విశాలాంధ్ర-పలాస-మందస: దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిన గిరిజన గ్రామాలకు.. గిరిజనేతరులు నివసిస్తున్న గ్రామాలకు పూర్తిస్థాయి రహదారులు వంతెనలు లేవు. దీంతో గిరిజనులు గిరిజనేతర ప్రజలు అష్ట కష్టాలు అనుభవిస్తున్నారు. తుఫాన్ ల వాయుగుండాలు వచ్చే సమయంలో బయట ప్రపంచంతో ఈ గ్రామాలకు సంబంధాలు పూర్తిగా ఉండవు. అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలు కూడా అందవు. దీంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ గ్రామాల పరిధిలో ఉన్న విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థలకు వెళ్లాలన్న కష్టాలు తప్పడం లేదు. పూర్వపు సోంపేట నియోజకవర్గం పరిధి లోను 2009వ సంవత్సరంలో ఏర్పడిన ప్రస్తుత పలాస నియోజకవర్గం పరిధిలో ఉన్న మందస మండలంలో ఇటువంటి పరిస్థితి అధిక శాతం ఉంది. వంతెనలు రహదారులు పూర్తిగా లేక సుమారు పది పంచాయతీల పరిధిలో నివసిస్తున్న గిరిజనులు.. గిరిజనేతరులు అవస్థలు పడుతున్నారు. దశాబ్దాల తరబడి తమ గ్రామాలకు వంతెనలు కావాలని రోడ్డు సౌకర్యాలు కావాలని కోరుతున్న ఈనాటికి వీరి కోర్కెలు నెరవేరడం లేదు. చీపి గిరిజన గ్రామం వద్ద మహేంద్ర తనయ నది మధ్యలో నిర్మించిన డైవర్షన్ రోడ్డు వద్ద వంతెన పూర్తిగా లేదు. బెల్లుపటియా గ్రామం వద్ద ఉన్న మహేంద్ర తనయ గడ్డ మధ్యలో డైవర్షన్ రోడ్డు ఉంది. వానాకాలంలో ఈ రోడ్డు మీదుగా ఉధృతంగా గడ్డనీరు ప్రవహిస్తుంది. దీంతో ప్రజల రాకపోకలు వాహనాల రాకపోకలు వారాల తరబడి ఉండవు.బొందికరి గిరిజన గ్రామం సమీపంలో ఉన్న వంతెన

శిథిలవస్తకు చేరుకుంది. చీపి నుంచి బుడంబో వెళ్లే దారిలో సునాముది గెడ్డపై వంతెన పూర్తిగా లేదు. ఇక్కడ చిన్న డైవర్షన్ రోడ్డు ఉంది. బంజర యువరాజు పురం గ్రామం వద్ద ఉన్న సునాముది గెడ్డపై వంతెన లేదు. ఇక్కడ కూడా డైవర్షన్ రోడ్డు ఉంది. ఈ డైవర్షన్ రోడ్లన్నీ ఎండాకాలంలోనూ చలికాలంలోనూ ప్రజలు.. గిరిజనులు నడవడానికి మాత్రమే పనికి వస్తాయి. శ్రీనివాసపురం గ్రామానికి వెళ్లాలన్న రహదారి పూర్తిగా లేదు. మహేంద్ర తనయ నదిపై వంతెన కావాలని దశాబ్దాలుగా కోరుతున్నారు కానీ ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ

నెరవేరడం లేదు. డిమిరియా గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వంతెన శిధిలావస్థకు పూర్తిగా చేరుకుని కుప్పకూలడానికి సిద్ధంగా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంకా అనేక గ్రామాలు ఉన్నాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లోనూ గిరిజనేతర గ్రామాల పరిధిలో వంతెనలు రహదారులు పూర్తిగా లేకపోవడంతో గ్రామ సచివాలయాలకు వెళ్లడానికి కూడా గిరిజనులు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ వాన కాలంలో రేషన్ సరుకులు డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాలన్న అనేక కష్టాలు పడుతున్నారు. వంతెనలు పూర్తిస్థాయి రహదారులు నిర్మాణానికి ప్రతి ఐదేళ్లకు ఓసారి జరుగుతున్న అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రజలకు హామీలు ఇచ్చి ఆ తర్వాత మరచిపోవడమనేది ఆనవాయితీగా మారిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలకు వంతెనలు రోడ్లు నిర్మించి రహదారి సౌకర్యం కల్పిస్తామని హామీలు ఇచ్చి రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోతున్నారని గిరిజనుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.